ప్రజాశక్తి

గురువారం 19 సెప్టెంబర్ 2024

ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

నిర్మాణంలో ఉన్న ఎయిర్‌పోర్టు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని మంత్రివర్గం తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం సమావేశమైన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 2200 ఎకరాల్లో తొలి విడతలో భాగంగా రూ.4502 కోట్లతో విమానాశ్రయ పనులు జరుగుతున్నాయి. 2026 నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా జిఎంఆర్ సంస్థ పనులను ముమ్మరంగా చేపడుతోంది. ఇప్పటివరకు 41శాతం పనులు పూర్తయ్యాయి.

మరో ఆన్‌లైన్ మోసం

విజయనగరంలోని ఐఎఎస్ యాప్ కార్యాలయం

జిల్లాలో మరో ఆన్‌లైన్‌మోసం వెలుగు చూసింది. జిల్లాకు చెందిన వేల మంది ఖాతాదారులను మోసగించి కోట్లాది రూపాయలకు ఆ సంస్థ ఎగనామం పెట్టింది. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. గత నాలుగు నెలలుగా కార్యకలాపాలు సాగించిన ఐఎఎస్ (ఇండియా అడ్వర్‌టైజింగ్ సర్వీసు) అనే సంస్థ ఆన్‌లైన్‌లో ఐఎఎస్ యాప్‌లో పెట్టుబడి పెట్టించి కోట్లాది రూపాయలు మోసం చేసిందని ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాసన్నపేట రింగ్‌రోడ్డు వద్ద గల ఈ సంస్థ కార్యాలయానికి తాళాలు వేసి ఉండడంతో ఖాతాదారులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆన్‌లైన్ వ్యాపారాలు, యాప్‌లను నమ్మి మోసపోవద్దని ఓ వైపు పోలీసులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నా, ప్రతిరోజూ ఇలాంటి మోసాలు జరుగుతున్నా ఈజీగా డబ్బు సంపాదించ వచ్చునన్న అత్యాశతో డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

- బోర్డు తిప్పేసిన ఐఎఎస్ యాప్
- ఉమ్మడిజిల్లాలో 30 వేలకు పైగా ఖాతాదారులు
- రూ.కోట్లలో డిపాజిట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఐఎఎస్ సంస్థలో చేరిన ఖాతాదారులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఐఎఎస్ సంస్థ ఆన్‌లైన్ బేస్డ్‌గా కార్యకలాపాలు నిర్వహించింది. పెట్టుబడులను ఆకర్షించడానికి కమీషన్లు ఆశ చూపించి ఏజెంట్లుగా కొంతమందిని ఏర్పాటు చేసుకుంది. ఏజెంట్లుగా వారు చేర్పిన ఖాతాదారులు యాప్‌లో లైక్‌లు కొట్టి, షేర్ చేస్తే నెలకు రూ.15వేలు నుంచి లక్ష రూపాయలు వరకు ఆదాయం వస్తుందని ప్రచారం చేయడంతో ఈజీగా డబ్బు సంపాదించవచ్చునని ఆశపడి ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఈ యాప్‌లో డబ్బులు కట్టి చేరారు. చేర్పించిన వారి సంఖ్యను బట్టి హోదా ఇచ్చి కమీషన్ చెల్లింస్తుండడంతో వారి స్నేహితులు, సన్నిహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు పేరున పెట్టుబడులు పెట్టించారు. రూ.2100, రూ.5500, 18300, రూ.55వేలు ఐఎఎస్ యాప్ ద్వారా జమ చేయించారు. ఈ యాప్‌లోకి ఎంటర్ అయిన తరువాత ఆయాప్‌లో ఖాతాదారుల నుంచి వసూలు చేసే మొత్తాన్ని జమ చేస్తుండేవారు. ఈ మొత్తం ఒక్కోసారి ఒక్కొక్కరి ఖాతాలో జమవుతుండేది. యాప్‌లో చాటింగ్ తప్ప నేరుగా సమాచారం ఇచ్చేవారు ఉండరని ఏజెంట్లు చెబుతున్నారు.

ఆన్‌లైన్ లింకు ద్వారా జమ

ఖాతాదారుల నుంచి జమ చేయించిన మొత్తాలను స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి వారంలో ఐదు రోజులకు వచ్చే లాభాలను ప్రతి శుక్రవారం ఐఎఎస్ వాలెట్ ద్వారా ఖాతాదారులకు చెల్లింపులు చేస్తామన నమ్మబలికారు. ఒక వేళ విత్‌డ్రా చేసుకోకపోతే, ఆ మొత్తాన్ని తిరిగి పెట్టుబడిగా పెట్టవచ్చునని, లేదంటే రావాల్సిన మొత్తం వెనక్కి వెళ్లిపోతుందని ప్రచారం చేశారు. ఇందులో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపించే వారికి మొదటి ఒక లింక్ ఫోన్‌కు వస్తుంది. ఈ లింకు క్లిక్ చేస్తే అందులో పేరు, చిరునామా, ఆధార్, బ్యాంకు ఆకౌంట్ వివరాలు ఇస్తే అందులో ఎంత పెట్టుబడికి ఎంత రిటర్న్స్ వస్తుందో వివరాలు కనిపిస్తాయి. ప్రతి విత్‌డ్రాకు పదిశాతం సర్వీసు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు చూపించారు. రూ.2100 జమ చేస్తే రోజుకు రూ.75చొప్పున, ఏడాదికి రూ.22500, రూ.18300కు రోజుకు రూ.600 చొప్పున రిటర్న్స్ ఏడాదికి రూ.1.98లక్షలు రిటర్న్స్ వస్తాయని ఐఎఎస్ సంస్థ కమిషన్ ఏజెంట్ల ద్వారా ఖాతాదారులకు ఎరవేసి పెట్టుబడులు పెట్టించింది. ఇలా ఉమ్మడి జిల్లాలో 30వేల మంది ఈ యాప్‌ద్వారా డబ్బులు కట్టినట్లు తెలుస్తోంది. మొదట్లో చేరిన వారంతా ప్రతి వారం వాలెట్ ద్వారా రిటన్స్ రావడంతో వారంతా అత్యాశకు పోయి చిన్న మొత్తాలు జమ చేసిన వారంతా రూ.18300, రూ.55వేలు జమ చేయడం ప్రారంభించారు. కొంతమంది ఒకటి రెండుసార్లు వారికి వచ్చిన కమీషను డబ్బులను తీసుకున్నారు. వీరంతా ప్రచారం చేయడంతో మిగతా జనాలు ఎగబడి కట్టేశారు.

ఎవరూ ఫిర్యాదు చేయలేదు

ఐఎఎస్ యాప్ ద్వారా డబ్బులు చెల్లించి మోసపోయిన వారెవరూ ఇంతవరకు తమకు ఫిర్యాదు చేయలేదని టూ టౌన్ సిఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఫిర్యాదులొస్తే పరిశీలిస్తామని తెలిపారు.

కార్యాలయం మూతతో ఆందోళన

రెండు రోజులుగా యాప్‌ద్వారా లావాదేవీలు నిలచిపోవడంతో ఒక్కసారిగా ఖాతాదారులంతా ఉలిక్కి పడ్డారు. డబ్బులు జమ చేసిన వారి సంఖ్య అమాంతంగా పెరగడం, తక్కువ మొత్తాలు కట్టిన వారికే రిటర్న్స్ రావడంతో పెద్ద మొత్తం కట్టేవారిని వారి కొన్నాళ్లు వేచి ఉండాలని యాప్ ద్వారా సమాచారం ఇచ్చారు. అంతేకాకుండా కమీషన్ డబ్బులను డ్రా చేసుకోవాలంటే లక్షకు రూ.30వేలు చొప్పున చెల్లించాలని చెప్పారు. అంతేకాకుండా ఒక్కసారిగా యాప్ లావాదేవీలను నిలిపివేశారు. దీంతో ఎవరిని సంప్రదించాలో తెలియక మంగళవారం దాసన్నపేట వద్ద ఉన్న కార్యాలయానికి పలువురు చేరుకున్నారు. తాళాలు వేసి ఉండడంతో లబోదిబోమన్నారు. సమాధానం చెప్పేవారు లేకపోవడంతో ఎవరికి చెప్పాలో తెలియక దు:ఖాన్ని దిగమింగు కుంటున్నారు.

ఏరులై పారనున్న మద్యం

మద్యం ఇక నుంచి ఏరులై పారనుంది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఉన్న మద్యం విధానాన్నే నేడు అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ప్రైవేటు షాపుల ద్వారా మద్యం విక్రయాల అమలు, ఆచరణలో లోపాలు, భారాల మాట అటుంచితే గతంతో పోలిస్తే నూతన మద్యం పాలసీ ప్రకారం ధరలు తగ్గుతాయని అంతా భావిస్తున్నారు. గత ఐదేళ్లగా వ్యాపారానికి దూరంగావున్న వారు ఈసారి విక్రయాలకు పోటీపడే అవకాశాలు ఉన్నాయి. ఇదే సందర్భంగా గడిచిన ఐదేళ్లపాటు ప్రభుత్వ నిర్వహణలో సాగుతున్న మద్యం దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది ఉపాధి కోల్పోనున్నారు. నాణ్యమైన మద్యాన్ని తగ్గింపు ధరలకు అందుబాటులోకి తెస్తామంటూ ప్రభుత్వం ఆశచూపింది. ప్రస్తుతమున్న ప్రభుత్వ మద్యం దుకాణాల కంటే వాటి సంఖ్య పెరగ నుండడదంతో మద్యం ఏరులై పారనుంది.



- ప్రయివేటు షాపుల ద్వారా లిక్కర్ విక్రయాలు
- పెరగనున్న దుకాణాలు
- 2శాతం మార్జిన్ పెంపు
- పాత బ్రాండ్లకు పెద్దపీట
- అక్టోబర్ నుంచి అమలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సర్కారుకు ఆదాయం సమకూర్చే వనరుల్లో ఎక్సైజ్ శాఖ అత్యంత కీలకంగా మారింది. ఈ శాఖ ద్వారా ఏటా సర్కారు వేలకోట్ల ఆదాయం వస్తుందనడంలో సందేహం లేదు. ఈ శాఖ ఆధ్వర్యాన కొన్ని దశాబ్దాలగా మద్యం విక్రయాలు ప్రైవేటు వ్యాపారుల ద్వారా నడిచేవి. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగంలో మద్యం షాపులు పెట్టి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఏళ్లనాటి బ్రాండ్లు కూడా కనుమరుగయ్యాయి. మందుబాబులకు సైతం ఏమాత్రం పరిచయం లేని కొత్త కొత్త బ్రాండ్లు రోజుకొకటి తెరపైకి వచ్చాయి. అవన్నీ నాశిరకం కావడం వల్ల మద్యం ప్రియులు అనారోగ్యం పాలవుతున్నారంటూ నాడు ప్రతిపక్షంలోవున్న టిడిపి, జనసేన పార్టీలు విస్తృతంగా ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే మద్యం ధరలు తగ్గించడంతోపాటు నాణ్యమైన సరుకు అందుబాటులోకి తెస్తామని కూడా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన దాదాపు 100రోజులకు నూతన మద్యం పాలసీని బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఖరారు చేసింది.మరోవారం రోజుల్లో నోటిఫికేషన్ వెలువడనుంది. ప్రస్తుతం జిల్లాలో 149 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ పాలసీ ప్రకారం మరో 15 నుంచి 20 దుకాణాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇక నుంచి ప్రభుత్వ ఆధ్వర్యాన కాకుండా, ప్రైవేటు పద్ధతిలో నడపనున్నారు. జిల్లాలోని దుకాణాల్లో 10శాతం గీత కార్మిక కుటుంబాలవారికి రిజర్వు కానున్నాయి. మొత్తం దుకాణాలన్నీ లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. లాటరీలో పాల్గొనేందుకు రూ.2లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి వుంటుంది. లాటరీలో షాపులను దక్కించుకున్న వారు సంబంధిత దుకాణం పరిధిలోని జనాభాను బట్టి రూ.50లక్షల నుంచి 80లక్షల వరకు లైసెన్సు ఫీజు చెల్లించాల్సి వుంటుంది. గతంలో ఈ ఫీజు 45లక్షల మాత్రమే ఉండేది. 18శాతం మార్జిన్ ఉండగా కొత్త విధానం అమల్లోకి వచ్చాక మద్యం వ్యాపారులకు 20శాతం ఉంటుందని మంత్రి ప్రకటించారు. గతంలో అత్యంత తక్కువ ధర రూ.120కు లభ్యమయ్యే 180మిల్లీ లీటర్ల మద్యం ఇక నుంచి రూ.99కే అందుబాటులోకి రానుంది. 2019నాటికి ముందున్న బ్రాండ్లన్నీ అందుబాటులోకి రానున్నాయి. పాత విధానంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడపడం వల్ల ప్రతి దుకాణంలోనూ ముగ్గురు సిబ్బందిని నియమించారు. ఇందుకోసం మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు లేఖలు, ఇవి చాలవన్నట్టు చేతులు తడపడాలు వంటివి జరిగాయి. ఇందుకోసం ఆయా ఉద్యోగులు రూ.లక్షలు ముడుపులు చెల్లించారు. వీరంతా తాజా విధానంతో ఉపాధి అవకాశం కోల్పోనున్నారు.

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

1260 మంది ఎంపిక

ప్రజాశక్తి-భోగాపురం

జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు

జిల్లా నైపుణ్యాభివద్ధి శాఖ ఆధ్వర్యంలో భోగాపురంలోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన వచ్చింది. ఎంఎల్ఎ లోకం నాగమాధవి చొరవతో, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ మెగా మేళాకు మొత్తం 29 కంపెనీలు హాజరై, తమ సంస్థల్లో ఉద్యోగాల భర్తీ చేపట్టారు. మేళాకు సుమారు 5,800 అభ్యర్థులు హాజరుకాగా, వీరిలో 1260 మందిని ఎంపిక చేశారు. వీరిలో 70 మందికి అప్పటికప్పుడే ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. అంతకుముందు జాబ్‌మేళాను ప్రారంభించిన కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా వారిలో నైపుణ్యాన్ని వృద్ధిచేసి, తద్వారా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. . ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, జీవితంలో ఉన్నత స్థానాన్ని సాధించేందుకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. నెల్లిమర్ల ఎంఎల్ఎ లోకం నాగమాధవి మాట్లాడుతూ, 5 ఏళ్లలో 20 లక్షలమందికి ఉద్యోగాలను కల్పించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేయడం ద్వారా తొలిఅడుగు వేస్తున్నామని అన్నారు. మౌలిక వసతులను కల్పించడం, యువతకు ఉద్యోగాలను కల్పించడం ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జిల్లా నైపుణ్యాధికారి గోవిందరావు, ఉపాధి అధికారి డి.అరుణ, తాహశీల్దార్లు తాడ్డి గోవింద, ఎం.సురేష్, సిడాప్ జెడిఎం మార్టిన్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిఇఒ లోకం ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ బెహరా, డీన్ శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ధైర్య సాహసాలు భేష్

పోలీసు సిబ్బందికి ఎస్‌పి అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం 2వ పట్టణ పోలీసుస్టేషన్ కానిస్టేబులు పి.కృష్ణ విధి నిర్వహణలో కనబర్చిన ధైర్యసాహసాలను ఎస్‌పి వకుల్‌జిందాల్ అభినందించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గత నెల 24న పూల్ బాగ్ కాలనీ ఎంఆర్ పిజి కాలేజి సమీపంలో కొంతమంది యువకులు గంజాయి సేవించి, మత్తులో చుట్టు ప్రక్కల ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నారని డయల్ 100కు సమాచారం అందిందన్నారు. ఈ సమాచారాన్ని ఎస్‌పి ఆదేశాలతో విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనుకు అందించగా, కానిస్టేబులు పి.కృష్ణ, హెడ్ కానిస్టేబులు జనార్ధనరావు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్ళారు. అక్కడ కొంతమంది స్థానిక యువకులు గంజాయి సేవించి, గంజాయి మత్తులో చుట్టు ప్రక్కల ప్రజలను తూలనాడుతూ, వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. గంజాయి మత్తులో ఉన్న వారిని నియంత్రించేందుకు కానిస్టేబులు, హెచ్‌సి ప్రయత్నించగా, వారు పోలీసులపై దాడికి ప్రయత్నించారు. కానిస్టేబులు పి.కృష్ణ తన ప్రాణాలను లెక్క చెయ్యకుండా, వారితో తలపడి, గంజాయి మత్తులో ఉన్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని, 2వ పట్టణ పోలీసు స్టేషనులకు తరలించారు. విధి నిర్వహణలో సమర్ధవంతంగా వ్యవహరించి, పోలీసుశాఖ ప్రతిష్టను ఇనుమడింప జేయడమే కాకుండా గంజాయి, మద్యం మత్తులో ఉన్న యువకులనుఅదుపులోకి తీసుకున్న కానిస్టేబులు పి.కృష్ణను ఎస్‌పి అభినందించారు. కార్యక్రమంలో టూటౌన్ సిఐ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయండి

- రాజాం, రామభద్రాపురంలో కొనుగోలు కేంద్రాలు
- మద్దతుధర క్వింటాకు రూ.7,521
- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. పత్తికొనుగోలుపై తన ఛాంబర్లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 1574 హెక్టార్లలో పత్తి సాగువుతోందని, ఈనెల 23లోగా ఈ పంట ఈ క్రాప్ పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబరు రెండో వారం నుంచి ప్రత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఆ లోగా వాటికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాజాం, రామభద్రాపురంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది క్వింటాకు రూ.7,521గా మద్దతుధరను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయించిందని తెలిపారు. తేమశాతం నిర్ణీత 8శాతం కంటే ఎక్కువగా ఉన్నట్లయితే, శాతాన్ని బట్టి మద్దతు ధర క్రమంగా తగ్గుతుందని వివరించారు. తేమ 12 శాతం కంటే ఎక్కువ ఉంటే కొనుగోలు చేయడం కుదరదని, అందువల్ల రైతులు ప్రత్తి పంటలో తేమ ఎక్కువ లేకుండా తగిన చర్యలను తీసుకోవాలని సూచించారు. తక్కువధరకు బయట మార్కెట్లో విక్రయించి నష్టపోవద్దని, రైతుల శ్రేయస్సు కోసమే ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 1900 మెట్రిక్ టన్నుల ప్రత్తి పండే అవకాశం ఉందని, ఈ మేరకు కొనుగోలుకు, గోదాములకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గోదాములవద్ద, స్పిన్నింగ్ మిల్లువద్ద అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాజాం ఎఎంసి గోదాము నుంచి రామభద్రపురం స్పిన్నింగ్ మిల్లుకు ప్రత్తిని తరలించేందుకు, రవాణా ఛార్జీలపైనా చర్చించారు. జిల్లాలో పత్తి పండించిన రైతులంతా ఎటువంటి పరిస్థితిలోనూ నష్టపోకుండా చూడాలని జెసి ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ ఎడి బి.రవికుమార్, జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, జిల్లా అగ్నిమాపకాధికారి బి.రామ్‌ప్రకాష్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పివి రంగారెడ్డి, ఆర్‌టిఒ ఎవి రమణ, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఎవి లీలారావు తదితరులు పాల్గొన్నారు. ప్రత్తి కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, ప్రిన్సిపల్ సాయిదేవ మణి

కరాటేలో 'సత్య' విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కరాటేలో కోచ్ సంతోష్ కుమార్ ఆధ్వర్యం లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈనెల 15న విశాఖపట్నం లో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల లో వివిధ విభాగాలలో పతకాలు సాధించారు.ఈ పోటీలు ఆంధ్ర ప్రదేశ్ చీఫ్, సినీ నటుడు కె.సుమన్, విజనగరం జిల్లా చీఫ్ సంతోష్ కుమార్, శ్రీకాకుళం జిల్లా చీఫ్ డిల్లేశ్వర రావు ఆధ్వర్యంలో పోటీలో పాల్గొన్న మిస్టర్ కె.మోహన్ చంద్ర కుంటీలో బంగారు పతకం సాధించాడు. కె.సాత్విక్ రజిత, కాంస్య పతకాలు, కె.శివ గణేష్ రజిత, కాంస్య పతకాలు, కె.స్నేహ, ఎన్. జననీ, ఆర్.గణేష్, జె. శరత్ చంద్ర, ఎం. హర్ష వర్ధన్, జె. నివాన్ నందన్ కాంస్య పతకాలు పొందారు. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి అభినందించారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో అండర్ 14,17 ఫుట్‌బాల్ జట్లు ఎంపిక బుధవారం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా జట్లు ఎంపిక చేస్తామనిస్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంబించారు. జిల్లా జట్లుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లో రాణించి సత్తా చాటాలని, క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని కోరారు. అనంతరం ఒక్కొక్క.విభాగంలో 18 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు చిన్నారి, గోపాల్, ఉ మ్మడి జిల్లా నుంచి 250 మంది

స్వచ్ఛత హి సేవలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-భోగాపురం

చెరువు గట్టుపై చెత్తను ఎత్తివేసి డబ్బాలో వేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతీఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భోగాపురంలోని గంగరాల చెరువు గట్టుపై బుధవారం నిర్వహించిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంబేద్కర్, ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొన్నారు. చెరువుగట్టుపై పేరుకుపోయిన చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. పరిశుభ్రమైన, స్వచ్ఛమైన గ్రామాలే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, గ్రామ సర్పంచ్ ఊడికల అప్పయ్యమ్మ, తహశీల్దార్ సురేష్, ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి సురేష్, ఇతర మండలస్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తోనే మెరుగైన ఆరోగ్యం

విజయనగరం టౌన్ :పరిసరాల పరిశుభ్రత గా ఉంచడం ద్వారానే మెరుగైన ఆరోగ్యం ఉంటుందని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు.స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సిఎంఆర్ జంక్షన్ నుంచి పెద్ద చెరువు మీదుగా ఎమ్మార్ కాలేజీ జంక్షన్ వరకు 2 కె రన్ బుధవారం ఉదయం నిర్వహించారు. నగర పాలక సంస్థ సిబ్బంది,ఉద్యోగులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఉద్యోగులు, క్రీడాకారులు 2 కె రన్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ స్వచ్ఛత పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామన్నారు. ప్లాస్టిక్ వంటి వాటిని నియంత్రించి పర్యావరణ పరిరక్షణ కు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు మత్స సంతోషి, బంగారు ఉష, నగర పాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, క్రీడాకారులు

వరద బాధితులకు న్యాయవాదుల విరాళం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విరాళం అందజేస్తున్న న్యాయవాదులు జి.సత్యం, రమేష్‌రాజు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా కోర్టు ఆవరణలో జన విజ్ఞాన వేదిక, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు న్యాయ వాదులు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి పి.రమేష్‌రాజు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో జెవివి నగర అధ్యక్షుడు షిణగం శివాజీ, ప్రధాన కార్యదర్శి పి. షణ్ముఖరావు, జిల్లా శాఖ సభ్యులు శీరాపు శ్రీనివాసరావు,ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు, ఆర్ఎంపి వైద్యుడు దివాకర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ తమన్న శెట్టి, విజయనగరం బార్ అసోసియేషన్ పూర్వ ప్రెసిడెంట్ దామోదర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు జి.సత్యం, న్యాయవాదులు చందక చిన్ని ప్రభాకర్, కరణం సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రైలు ప్రయాణీకుల సహాయం

విజయనగరం కోట : విజయవాడ వరద బాధితులను ఆదుకొనేందుకు రోజు వారీ రైల్వే ప్రయాణీకులు ముందుకు వచ్చి ఉదారంగా సహాయం అందించారు. శ్రీకాకుళం నుంచి విజయనగరం వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో పని చేసే నిమిత్తం రైళ్లలో ప్రయాణించే వారంతా కలిసి తమ వంతుగా వరద బాధితులకు రూ 31,470 విరాళంగా అందజేశారు. ఈమొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు బుధవారం అందజేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో సూర్యనారాయణ, వెంకట కృష్ణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు. వీరిని జిల్లా కలెక్టర్ అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తపేట, రాజీవ్ నగర్ ప్రాంతాలలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమాన్ని ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు తమ విధులలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించకుండా చేపట్టాల్సిన విధివిధానాలపై వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కల్పన తోపాటు ఎంహెచ్ఒ సాంబమూర్తి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు తగిలే చిన్న గాయాలను కూడా ఏమరుపాటు చేయకూడదని అన్నారు. చక్కెర వంటి వ్యాధులు ఉన్నవారు మరింత జాగురూకతతో ఉండాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు అంజిబాబు, సాలెం రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా మహాకవి గురజాడ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 21న మహాకవి గురజాడ వెంకట అప్పారావు 162వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో గురజాడ జయంతి ఉత్సవాల పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురజాడ గృహం వద్ద ఉదయం 9 గంటలకు జ్యోతి ప్రకాశనం చేసే గురజాడ విగ్రహానికి పూల మాలాలంకరణ చేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో సభా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ అనిత, కమిషనర్ నల్లనయ్య, డిపిఆర్‌ఒ డి.రమేష్, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, కెవిఎల్ఎన్ శాస్త్రి, తహశీల్దార్ కుర్మనాథ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

రామభద్రపురం: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. ఎస్‌ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్‌పి హైస్కూల్లో వివిధ పోలీసు చట్టాలు, నిబంధనలు, ఉల్లంఘనలకు విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ నేరాలు దీనికి విధించే శిక్షలు వివరించారు. ఇటీవల సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని వీటి నివారణకు తల్లిదండ్రులకు విద్యార్థులే అవగాహన కల్పించాలని, సైబర్ నేరాళ్లు చేసే నేరాలు సోదాహరణంగా వివరించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు వినియోగించరాదని, రహదారి భద్రతకు పెద్దపీట వేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.

ప్రకృతి సాగు పరిశీలన

వేపాడ: మండలంలోని సోంపురం, జగ్గయ్యపేట ప్రకృతి వ్యవసాయ పంటలను డిపిఎం ఆనందరావు, కొత్తవలస డివిజన్ ఎడిఎ యశ్వంత్ బుధవారం పరిశీలించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వరిలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపైన ఎడిఎ రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తయారు చేసిన కషాయాలు వాడడం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గడంతో పాటు అధిక ఆదాయాన్ని పొందవచ్చని, నాణ్యమైన పంటను తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయం ఎంతగానో ఉపయోగపడుతుందని డిపిఎం ఆనంద్ రావు తెలిపారు. అనంతరం తెగుళ్ళ నివారణకు ఉపయోగపడే జిల్లేడు ద్రావణాన్ని సామూహికంగా తయారు చేయడాన్ని ఆయన పరిశీలించారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం

బొబ్బిలి: విద్యాభివృద్ధికి, సమాజాభివృద్ధికి ఉత్తమ సేవలు అందించిన వారు సత్కారానికి అర్హులని చింతాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్ దీవెనమ్మ అన్నారు. బుధవారం చింతాడ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ పాఠశాల సముదాయం నిర్వహించారు. పాఠశాల సముదాయం అనంతరం ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన జిల్లా ఇంగ్లీష్ రిసోర్స్ పర్సన్ మెట్టవలస ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ బోధకులు బారు వేణును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. సమావేశంలో జిసి రాజు, బలరాం నాయుడు, మోహన రావు, డిఆర్‌పి సుగుణ, ఆంగ్ల భాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు భారీ విరాళాలు

బొబ్బిలి: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సిఎం సహాయ నిధికి విరాళాలు భారీగా చేరుతున్నాయి. వాసు విద్యా సంస్థలు వ్యవస్థాపకులు రౌతు రామమూర్తి, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు రూ.1,16,116 చెక్కును ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. చౌదరి బ్రదర్స్ రూ.1.50లక్షలు, గున్నతోటవలస టిడిపి తరుపున సర్పంచ్ ఎస్.ఈశ్వరరావు రూ.63వేలు, దిబ్బగుడ్డివలస టిడిపి తరుపున మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ రూ.73వేలు, గొర్లె సీతారాంపురం సర్పంచ్ రూ.20వేలు విరాళాలను ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు.

యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

వేపాడ: ఆంధ్ర సపోర్టు లెర్నింగ్ ఇన్సులేషన్ చాట్ యాప్‌ను ఉపాధ్యాయులందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎంఇఒ జి. జగదీశ్వరరావు కోరారు. మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. వేపాడ, ఎన్‌కెఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్‌లో మరో ఎంఇఒ పి. బాలభాస్కరరావు పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పేదల పక్షపాతి ఏచూరి

వేపాడ: పేదల పక్షపాతి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని, కార్మిక రాజ్య స్థాపనకు కృషి చేయడమే ఆయనకి కార్మిక వర్గం ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ అన్నారు సీతారాం ఏచూరీ మరణం వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు, శ్రామిక వర్గానికి తీరనిలోటని అన్నారు. బుధవారం బొద్దాంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన ప్రజా ఉద్యమాలు నిర్వహించి ప్రజలకి అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చలుమూరి, కార్మికులు రాచర్ల రామారావు, పద్మారావు, అప్పారావు, బంగారయ్య రసూల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శృంగవరపు కోట: మండలంలోని తిమిడి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుబ్బలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్మాణం సగంలో ఆగిపోయిన అంగన్వాడి భవనం పూర్తి చేయడానికి మండలపరిషత్ నిధులు రూ. 4.90లక్షలు, దిగువ వీధిలో గ్రామ పంచాయతీ నుంచి రూ.2 లక్షలు కాలువలకు నిధులు మంజూరైన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వబ్బిన త్రినాథమ్మ ఎంపిటిసి పదాల ధర్మారావు, ఉపసర్పంచ్ బర్ల స్వామినాయుడు, వశి మాజీ సర్పంచ్ కారుకొండ వెంకటరావు, వబ్బిన సతీష్, వశి పైడిరాజు, పిల్లా వెంకటరమణ, పంచాయతీ సెక్రటరీ, రంగారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సాయి, అంగన్వాడీ సిబ్బంది, టిడిపి, జనసేన, బిజెపి నాయుకులు పాల్గొన్నారు.

గ్రామసభలు సక్రమంగా జరిగేలా చూడాలి

శృంగవరపుకోట: అక్టోబర్ 3వ తేదీ నుంచి జరిగే గ్రామసభలు సక్రమంగా జరిగేలా చూడాలని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరుతున్నామని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణంలో గల మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామసభలను సక్రమంగా రాష్ట్రంలో ఉన్న 13,326 పంచాయతీల్లో జరిగేలా తమ శాఖ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పవన్ కళ్యాణ్‌కు లేఖను పంపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు లంక సాంబమూర్తి, జి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

'వివేకానంద'లో ఎన్‌సిసి ఎంపికలు

శృంగవరపుకోట: పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో మహిళ విద్యార్థులకు ఎన్‌సిసి ఎంపికలు విజయనగరం ఎన్‌సిసి బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు రాత, ఫిజికల్ టెస్టులు నిర్వహించి ఎంపికలు చేశారు. సుబేదార్ చంద్రరావు, హుస్సేన్, హవాల్దార్ భాస్కరరావులు పాల్గొని ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. కరస్పాండెంట్ సిహెచ్‌ఆర్‌కె ప్రసాద్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కేర్ టేకర్ పూజిత, కళాశాల పీడీ భాను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ పరిసరాలు శుభ్రం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

గజపతినగరం: స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం పరిసరాలను బుధవారం శుభ్రం చేశారు. మాదకద్రవ్యాలకు కేరాఫ్ వసతి గృహం అనే కథన ప్రజాశక్తిలో వెలువడటంతో వార్డెన్ రామకృష్ణ స్పందించి మల మూత్ర, స్నానపు గదులను వసతి గృహ పరిసరాలను సిబ్బందితో శుభ్రం చేయించారు. విద్యార్థులకు ఖాళీ సమయంలో స్టడీ అవర్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రతతోపాటు క్రమశిక్షణ కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బొబ్బిలిలో గాలివాన బీభత్సం

బొబ్బిలి: బొబ్బిలిలో బుధవారం మధ్యాహ్నం గాలులతో కూడిన వర్షం కురిసింది. గాలి వీయడంతో టిఆర్ కాలనీలో చెట్టు నేలకూలింది. విద్యుత్ వైర్లపై చెట్టు పడడంతో వైర్లు తెగిపోయాయి. రోడ్డుపై చెట్టు కూలడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ చెట్టును తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరణ చేశారు. వర్షం కారణంగా తారకరామ కాలనీ మెయిన్ రోడ్‌లో పెద్ద చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. ఎటువంటి అపాయం జరగలేదు.

ఎయిడ్స్‌పై అవగాహన

వేపాడ: మండలంలోని బొద్దాంలో బుధవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, ఎంపిటిసి, ఎఎన్‌ఎం పి సంతోషి, ఆశ సిహెచ్ కుసుమ, మహిళా పోలీస్, బషీర్, కనకమహాలక్ష్మి, ఎన్ హరినాధరావు, ఎం. మంగ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

రైతులకు అన్నదాత పెట్టుబడి సాయం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాలని కోరుతూ కారాడ సచివాల యంలో బుధవారం కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే అన్నదాత పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చినప్పటికి అమలు చేయడం లేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న అమలు చేయక పోవడంతో రైతన్నలు అప్పులు చేసి పంటలను సాగు చేస్తున్నారని విమర్శించారు. పెట్టుబడి సాయం ఇవ్వాలని, రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని, వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, కౌలు రైతులకు భూయజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

కొత్తవలస: జిల్లాలో కౌలు రైతులకు సాగు హక్కు కల్పించాలని కోరుతూ నిమ్మలపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సాగు హక్కుదారులు ధర్నా చేశారు. అన్నదాత పెట్టుబడి సాయం రూ. 20వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగు రైతులకు రెండు లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని, ఉచిత బీమా పథకం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు, గొంప కృష్ణమూర్తి, కె. శ్రీనివాసరావు, గొంప నరసింహారావు, జి. రాము, జి. వరలక్ష్మి, గొంప వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న ఎస్.గోపాలం, రైతులు

గంట్యాడ : మండలంలోని బుడతనాపల్లి, మురపాక, పెదమజ్జిపాలెం తదితర గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులకు రైతు సంఘం ఆధ్వర్యాన వినతులు అందజేశారు.

శృంగవరపుకోట: రైతు రుణాలను రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూల బొడ్డవర గ్రామ విలేజ్ రెవెన్యూ అధికారి సోమరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే ఇవ్వాలని, 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లలో కరువు, తుపాన్లతో నష్టపోయిన పంటలకు బీమా పరిహారం సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని, వ్యవసాయ మోటర్లకు మీటర్లు వద్దని జిఒ 22 రద్దు చేయాలని, భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూలబొడ్డవర సచివాలయ పరిధిలో గల గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ, ఉపాధ్యాయులు

ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరణ

చీపురుపల్లి: సార్వత్రిక విద్యా పీఠం ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ ప్రేమ్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఓపెన్ స్కూలు పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ టి.సన్యాసి రాజు, మండల విద్యా శాఖాధికారి భూషినాయుడు, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె చంద్ర శేఖర్ కుమార్, పాఠశాల ఓపెన్ స్కూల్ కోర్డినేటర్ గదుల సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పి.వెంకటరావు, జమ్ము రామానాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లను సెటిల్ సర్వీసులుగా నడపాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పార్వతీపురం నుంచి విశాఖపట్నం పాసింజర్ రైళ్లను సెటిల్ సర్వీసులుగా నడపాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. పాసింజర్ రైళ్లను సెటిల్ సర్వీసులుగా నడిపి బొబ్బిలి-సాలూరు రైలు బస్సును నడపాలని, ఇంటర్ సిటి ఎక్స్‌ప్రెస్ రైలును ప్రతిరోజు నడపాలని కోరుతూ బుధవారం రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలిపి స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ పార్వతీపురం, బొబ్బిలి నుంచి రోజూ వేలాది మంది విద్యార్థులు చదువు కోసం, ఉద్యోగులు విధులు నిర్వహణకు, రోగులు వైద్యం కోసం రాకపోకలు చేస్తున్నారని చెప్పారు. పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా పాసింజర్ రైళ్లు, సాధారణ బోగీలు లేకపోవడంతో ప్రయాణికులు వేలాడుతూ కిక్కిరిసి ప్రయాణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాడుతూ ప్రయాణం చేయడంతో రైలు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో పేదలు అధికంగా ఉండడంతో రైలు ప్రయాణాలపై ఆధార పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బొబ్బిలి-సాలూరు రైలు బస్సు రద్దు చేయడంతో 6 గ్రామాలు, సాలూరు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పాసింజర్ రైళ్లను సెటిల్ సర్వీసులుగా నడిపించాలని, బొబ్బిలి-సాలూరు రైలు బస్సును నడపాలని, ఇంటర్ సిటి ఎక్స్‌ప్రెస్ రైలును ప్రతిరోజు నడపాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం స్టేషన్ మాస్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.శేషగిరిరావు, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మణికుమార్, విద్యార్థులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

రైల్వే మూడో లైన్ పరిశీలన

ప్రజాశక్తి- గజపతినగరం

పురిటిపెంటలో మూడో రైల్వే లైన్ కోసం జరుగుతున్న భూసేకరణను జాయింట్ కలెక్టర్ సేతు మాధవ్ బుధవారం పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ రత్నకుమార్ ఆర్. ఐ మురళీ, సర్వేయర్ సత్యం, విఆర్‌ఒ రాజు, విఎస్‌లు, రైల్ వే అధికారులు ఉన్నారు.

జెసి ఆకస్మిక తనిఖీ

బొండపల్లి : మండలంలోని గరుడబిల్లి గ్రామాన్ని బుధవారం జెసి సేతు మాధవన్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు ఈ- పంట, ఈకేవైసి జరుగుతున్న తీరును తనిఖీ చేశారు.

రైతులతో ఈ పంట నమోదు గురించి ముచ్చటించిన ఆయన ఈ నెల 23వ తేదీలోపు రైతులందరూ తమ పంట నమోదును, ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని ఆయన అన్నదాతలకు స్పష్టం చేశారు. ఈ పంట నమోదు వల్లనే వివిధ ప్రభుత్వ పథకాలైన పంటల బీమా, పంట నష్టపరిహారం, ధాన్యం కొనుగోలకు అర్హత ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారులు నిర్ణీత గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు, గజపతినగరం వ్యవసాయ సహాయ సంచాలకులు మహారాజన్, మండల వ్యవసాయాధికారి మల్లికార్జున్, ఉద్యాన అధికారి రాజశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు సంతోష్, అప్పలనాయుడు, అనిల్, సునీల్ గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రజత పతకాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ క్రీడాకారిణులు మూడు రజత పతకాలు సాధించారు. ఫీజి దేశంలో ఈ నెల 16 నుంచి 20 వరకు జరుగుతున్న కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో కొండవెలగాడకు చెందిన బెల్లాన భార్గవి, బెల్లాన హారిక ద్వితీయ స్థానంతో పతకాలు సాధించారు. 49కిలోల విభాగంలో స్నాచ్ 69, క్లీన్ జర్క్ 86 కిలోలు మొత్తం 155కిలోల బరువెత్తిన భార్గవి రజత పతకం సాధించగా 64కిలోల విభాగంలో స్నాచ్ 81, క్లీన్ జర్క్ 105 కిలోలు మొత్తం 186కిలోల బరువెత్తి సబ్ జూనియర్, జూనియర్ విభాగంలో హారిక 2 రజత పతకాలు సాధించింది. వీరిని రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నీలంశెట్టి శ్రీలక్ష్మీ, సెక్రటరీ దిన్నాబాబు, బడేటి వెంకట్రామయ్య, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బెల్లాన లక్ష్మీ, నరేంద్ర, సెక్రటరీ చల్లా రాము, కోచ్ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

పతకాలు సాధించిన భార్గవి, హారిక

సిఐటియు నుంచి రామ్మూర్తి నాయుడు తొలగింపు

ప్రజాశక్తి- రాజాం

రాజాం సిఐటియు నాయకుడుగా పనిచేస్తున్న సిహెచ్ రామ్మూర్తి నాయుడు ఆర్థిక అరాచకత్వం, నిధులు దుర్వినియోగం, క్రమశిక్షణ పాటించకపోవడం వల్ల సిఐటియు సంఘం నుంచి, అన్ని బాధ్యతలు నుంచి తొలగిస్తున్నట్లు సిఐటి యు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి. శంకరరావు, కె. సురేష్ తెలిపారు. బుధవారం వారు రాజాంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సిహెచ్ రామ్మూర్తి నాయుడు సిఐటి యు అనుబంధ సంఘాల నుంచి వసూలు చేసిన నిధులు సిఐటియు జిల్లా కేంద్రానికి జమ చేయకుండా, తెలియజే యకుండా తన సొంతానికి వాడుకోవడం సిఐటియు పద్ధతికి విరుద్ధమన్నారు. ఈ అంశంపై గతంలో వివిధ కమిటీలలో ఆయనపై చర్చ జరిగిన క్రమంలో సిఐటియుగా విచారణ చేసి నప్పుడు అనేక విషయాలు విలువడ్డాయన్నారు. కార్మికులందరూ సభ్యత్వం ఫండ్ ఇచ్చామని చెప్పినంత వరకు ఆయన జిల్లా కేంద్రానికి చెప్పకుండా దాపరికంగా ఉంచారన్నారు. ఆ క్రమంలో చర్చ జరిగినప్పుడు రామ్మూర్తి నాయుడు పద్ధతి మార్చుకోవాలని చెప్పిన తర్వాత కూడా రాజాం ఆర్‌పిలు, రైస్ మిల్లు కళాసీలు సభ్యత్వం ఫండ్ విషయం చెప్పకుండా సెంటర్‌కి జమ చేయకుండా పాత పద్ధతిలోనే ఆయన వ్యవహరించారన్నారు. ఈ ఆర్థిక ఆరోపణలపై వివిధ సమావేశాల్లో చర్చించి సరిచేయడానికి ప్రయత్నించినా ఆయన వైఖరిలో ఎటువంటి మార్పు లేదన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో సిఐటియు సంఘం నుంచి తొలగించాలని నిర్ణయించామన్నారు. నేటి నుంచి సిఐటియుకి రామ్మూర్తి నాయుడుకి ఎటువంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు యాప్

ప్రజాశక్తి -పూసపాటిరేగ

పాఠశాల స్థాయిలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించడానికి జాతీయ విద్యా పరిశోధన సంస్థ ప్రశస్థ యాప్ రూపొందించిందని పూసపాటిరేగ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బి. శంకరరావు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పూసపాటిరేగలో పలువురు ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ స్థాయిలో వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ పాఠశాలల్లో ఆటిజం, అభ్యాసన సమస్యలు, పరిమిత దృష్టి దోషాలు, ప్రవర్తన దోషాలు వంటి సమస్యలు ఉన్న పిల్లలు గుర్తించడం లేదన్నారు. ఇటు వంటి పిల్లలను గుర్తించడానికి ప్రశస్థ యాప్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం స్పెషల్ ఎడ్యుకేటర్ నడిపేన బంగారు నాయుడు ప్రశస్థా యాప్ ప్రాధాన్యత, దాని ఉద్దేశ్యం గురించి ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ యాప్ మొబైల్‌లో ఇన్స్టాలేషన్ రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని ఆయన వివరించారు. దీని ద్వారా పాఠశాలలో ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించడం ఎంతో సులభతరం అవుతుంద న్నారు. మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు ప్రశస్థా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బంగారునాయుడు కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్లు పి. అర్చన, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- విజయనగరం

గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూపర్ వైజర్ అనురాధ అన్నారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా విజయనగరం ఐసిడిఎస్ 5వ సెక్టార్ పరిధిలో ఉన్న అయ్యన్నపేట అంగన్వాడి కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు, పోషణ్ మహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంగా ఉండేలా తగు జాగ్రత్త తీసుకోవాలనిన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పుష్ప, లక్ష్మీ, రవణమ్మ, సాయి, తల్లులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మండలంలోని కెకె వలస సెక్టార్ పరిధిలో గల ఎస్ చింతలవలస గ్రామంలో బుధవారం పోషణ మహా వేడుకలు సెక్టార్ పరిధిలో గల అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించారు. సిడిపిఒ నాగమణి, సూపర్‌వైజర్ అపర్ణ రాణి, రిటైర్డ్ టీచర్ పతివాడ కృష్ణ, మహిళా పోలీసులు, ఎంఎల్‌హెచ్‌వి తదితరులు పాల్గొని తల్లులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

జూడో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - రామభద్రపురం

జిల్లా స్థాయి జూడో పోటీలకు మండల పరిధిలోని కొట్టక్కి జెడ్‌పి హైస్కూల్లో బుధవారం ఎంపికలు నిర్వహించారు. అండర్-14, 17, 19 విభాగాలకు జరిపిన ఈ ఎంపికల్లో 20 పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో అండర్-14 విజేతలకు మాత్రమే ఈ నెల 22, 23 తేదీల్లో తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అండర్-14కు ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఇఒ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షులు నల్ల వెంకటనాయుడు, జిల్లా జుడో అసోషియేషన్ కార్యదర్శి బొత్స రత్నకిశోర్, కొట్టక్కి పాఠశాల హెచ్‌ఎం రావాడ భాస్కరరావు, రామభద్రపురం పాఠశాల పీఈటీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మూర్ఛ వ్యాధితో బలవన్మరణం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రం వసంతల వీధికి చెందిన పూడి చంద్రశేఖర్ (38) బాత్‌రూమ్ శుభ్రం చేసే యాసిడ్ తాగి బలవన్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రశేఖర్ గత కొన్నేళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో వ్యాధి తీవ్రత తట్టుకోలేక మంగళవారం ఇంట్లో బాత్ రూంలో ఉన్న యాసిడ్ తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య, 8ఏళ్ల కుమార్తె, 6 ఏళ్ల కుమారుడు ఉన్నారు. సోదరుడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి రమణ తెలిపారు.

ఎస్ఐ నిర్లక్ష్యంపై ఎస్‌పికి ఫిర్యాదు

శృంగవరపుకోట : మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన ఎస్ కోట డిపో ఆర్‌టిసి బస్ డ్రైవర్ కేదారి శివ గణేష్‌పై వేపాడ చెరుకు కాటా వద్ద విధినిర్వహణలో ఉండగా కొంతమంది వేపాడ మండలానికి చెందిన వ్యక్తులు తనపై దాడి చేసిన విషయం తెలిసిందే. దీనిపై వేపాడ మండలం వల్లంపూడి ఎస్ఐ దేవికి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయడంలో ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరించారని దీంతో జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశామని కేదారి శివ గణేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేపాడ చెరుకు కాటా వద్ద కొంతమంది వ్యక్తులు దాడిచేసి రక్తం వచ్చేటట్లు గాయపరిచిన విషయమై నిందితులపై వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ఈనెల 13న వెళ్ళగా ఎస్ఐ నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. మళ్లా 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఎస్ కోట డిపో డ్రైవర్లు స్టేషన్ ముందు నిరసన తెలపగా సెక్షన్లను మార్చి ఎఫ్ఐఆర్ నమోదు చేసి దాడి చేసిన వ్యక్తులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు పెడతారని కేసు విత్ డ్రా చేసుకోమని నిర్లక్ష్యంగా మాట్లాడి తనను బెదిరించారని డ్రైవర్ తెలిపారు. దీంతో ఎస్‌పికి ఫిర్యాదు చేసామని, విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎస్.కోట ప్రభుత్వాసుపత్రిలో చేరి వైద్యం చేయించుకోవాలని తనకు సూచించారని ఆయన వివరించారు. ఇప్పటికైనా కేసు నమోదు చేస్తారో లేదోనని అనుమానం వ్యక్తం చేశారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గాదేల మర్రివలస, ఊటపల్లి జంక్షన్‌లో బుధవారం ఉదయం సుమారు పదిన్నర గంటల సమయంలో 15 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు బొబ్బిలి డిఎస్‌పి జి. శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ సందర్భంగా బుధరాయవలస పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో గాదేల మర్రివలస, ఊటపల్లి జంక్షన్‌లో అనుమాను స్పదంగా ప్రయాణిస్తున్న ఒక బైక్, ఒక ఆటోను అడ్డగించాం. బైక్ మీద ఉన్న వెంకటేష్, శ్రీరామ్ అనే వ్యక్తులు, ఆటోలో ఉన్న చిన్నారావు, నాగరాజు, సత్యనారాయణలు పారిపోవటానికి ప్రయత్నించి పోలీసులకు పట్టు బడ్డారు. ఆటోలో పరిశీలించగా గంజాయి అక్రమ రవాణా కోసం ఉంచినట్లు గుర్తించాం. ఆటోను బైక్‌ను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కేసు అత్యంత చొరవ చూపిన చీపురుపల్లి సిఐ శంకరరావు, బుధరాయవలస ఇంచార్జ్ ఎస్ఐ బి. లోకేశ్వరరావును డిఎస్‌పి అభినందించారు.

పారిశుధ్య కార్మికుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్‌గా విధులు నిర్వహిస్తున్న అంగి రమణ అనే వ్యక్తికి బుధవారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. వార్డు నెంబర్1 పరిధిలో గల డిఎస్ఎన్‌రాజు నగర్‌లో పారిశుధ్య పనులు నిర్వహణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా గల పచ్చిరొట్టను మెషిన్‌తో తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెషిన్ బ్లేడు విరిగి అంగి రమణ కడుపులోకి దూసుకుపోయింది. వెంటనే స్పందించిన సహచర ఉద్యోగులు స్థానిక ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించి, పై అధికారులకు, గ్రామ సర్పంచ్‌కు సమాచారం అందించారు. సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, సిబ్బంది హాస్పిటల్‌కు చేరుకుని తక్షణమే వైద్య సహాయం అందించాలని ఎంత ఖర్చైనా పరవాలేదని సర్పంచ్ చెప్పారు. ఆయన దగ్గరుండి వైద్యులతో శస్త్ర చికిత్స చేయించి కడుపులోకి వెళ్లిన ఇనుప ప్లేటును తీయించారు. ఎటువంటి ప్రాణహాని లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

బొబ్బిలి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు గత ప్రభుత్వం అమలు చేసిన టోఫెల్, ఐబిను రద్దు చేశారని, సిబిఎస్ఇ సిలబస్‌ను కూడా రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాల్సిన కూటమి ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు.

నోటీసు

మహారాజశ్రీ విజయనగరం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు మొబైల్ కోర్టు వారి కోర్టులో

O.S.No.392/2022

మాతా రమేష్ ....వాది
మరియు
తాటిశెట్టి బాల మురళీ కృష్ణ ....ప్రతివాది

To,
తాటిశెట్టి బాలమురళీ కృష్ణ, S/o మాధవరావు, వాటర్ ట్యాంక్ దగ్గర భోగాపురం గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు గల దావాలో మీపై వాదిగారు దావా పరిహారం నిమిత్తం పై కోర్టులో దావా వేసియున్నందున సదరు దావా సమన్లు మీరు తీసుకొనకపోవుట వలన శ్రీ కోర్టువారు అర్డరు ప్రకారం పై నెంబరు దావాలో దావా సమను అమలు చేయుటకు **తేది. 01-10-2024**వ తేదికి దావా నోటీసు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కనుక యిందుమూలంగా ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియచేయునది ఏమనగా పై నెంబరు దావాలో మీరు వాయిదా దినమున మీరు స్వయముగా గాని, లాయరు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరు అయి మీ తరపున వాదన తెలియజేయవలసినదిగా యిందు మూలంగా తెలియజేయడమైనది. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

పి.హరగోపాల్
అడ్వకేట్, విజయనగరం,
సెల్ : 9440721142

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM
E.P.11/2022 O.S.53/2005

Between :
Smt. Balla Punyavathi ....D.Hr/Plaintiff
And :
Smt. Ugiri Umamaheswari .....J.Dr's/Defendant

Notice to J.Drs 2 and 3

Hg : 25-9-2024

J.Dr.No.2 : Ugiri Santhos Kumar, S/o Late Muralidhara Rao, age 29 years, Hindu, R/at D.No.11-253, Teachers Colony, Kondapalem Grama Panchayat, Garividi Village & Mandal, Vizianagaram Dist.
J.Dr.No.3 : Ugiri Prasanth, S/o Late Muralidhara Rao, age 27 years, Hindu, Residing - do-

పై తెలిపిన O.S.53/2005 నందు వాది మీపై డిక్రీ పొంది సదరు డిక్రీని అమలు నిమిత్తం E.P.11/2022 వేసియున్నారు. సదరు అమలు నందు మీ J.Dr. No. 2 and 3 వున్నందున మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు అనేక పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము పై E.P.11/2022 తే 25-9-2024ది వాయిదా ఉన్నదని ఈ పత్రికా ముఖంగా తెలియపరుస్తూ సదరు వాయిదా **తే 25-9-2024 దిన ఉదయం గం॥ 10-30ని॥ల**కు మీరు గాని లేదా మీ తరపున వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయా మీ తరపున వాదనలు విన్నవించుకోవలెను. లేని ఎడల పై తెలిపిన కేసులో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఇట్లు
మావూరి శంకరరావు
D.Hr తరపు న్యాయవాది,
నెల్లిమర్ల, సెల్ : 9440074142

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P. No. 11 /2024

Between:-
Kusumanchi Venkata Ramana. ....Petitioner
And:-
Nadipilli Srinivasa Rao and 9 others...Respondents

Hearing Date: 04-10-2024

Notice to R1, R2, R3, R4, R5, R6, R7, R8, R9 & R10.

R1) Nadipilli Srinivasa Rao S/o. Not Known, Padhmavathi Balgiveedhi, Vizianagaram Town and District, Ph. No. 9290450933
R2) Palukuri Kaalidas S/o. Jaganadham, Bondadaveedhi, Vizianagaram Town and District. Ph. No. 9441415263
R3) Bathula Ravi S/o. Bathula Gunaraju, Ippiliveedhi, Vizianagaram Town and District. Ph. No .9492735998.
R4) Grandi Ramesh S/o not known, Pool Bagh Colony, Vizianagaram District.
R5) Boggarapu Mohan S/o. Subhramanyam, Kammaveedhi, VizianagaramTown and District. Ph. No 9441417274
R6) Kusumanchi Krishna S/o not known, R/o.pulbhagcolony Village, Denkada Mandal, Vizianagaram District. Ph.No.9866282821
R7) Grandhi Rajesh S/o not known, R/o. Municipal complex, SBS Center, Vizianagaram Town and District. Ph.No.9849124282
R8) Chenna Kesavalu S/o not known, Nagavamsapu veedhi , Vizianagaram Town and District. Ph.No.7382923877
R9) Dora Babu S/o.Not known, Kothapeta Mandapam area, Kothapeta water tank, Vizianagaram Town and District. Ph.No.9396975353
R10) Kona Srinivasarao S/o. karthikarao, Hindu, Aged about 30 years, R/o. near Kuppili Veedhi, Satyam, hospital, Vizianagaram.

ఇందుమూలముగా పైన తెలిపిన ప్రతివాదులందరికి తెలియజేయునది ఏమనగా విజయనగరం జిల్లా, విజయనగం టౌన్, కొత్తపేట మండపం, డోర్ నెంబర్ 13-11-16 కాపురస్తులు కుసుమంచి లేటు గంగ జోగిరాజు గారి కుమారుడు కుసుమంచి వెంకటరమణ తనకున్న అప్పులు చెల్లించలేని శక్తిలేదని తీర్పుచేయమని మరియు పైన తెలిపిన ప్రతివాదుల నుండి రక్షణ కల్పించమని శ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విజయనగరంలో I.P.No.11/2024 పిటిషన్ దాఖలు చేసి యున్నారు. కావున ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు వున్న యెడల స్వయముగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని **తే 04-10-2024 దిన ఉదయం గం॥ 10. 30 ని॥** పైన తెలిపిన కోర్టులో హాజరు కావలెనని, లేని పక్షంలో శ్రీ కోర్టువారు పరోక్షంగా తీర్మానించడమగునని ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసుగా తెలియజేయుచున్నాము.

P.KARUNAKAR
B.DEEPIKA
Advocate for the Petitioners,
Vizianagaram, Cell: 81251 58361